# దేవుడు తెల్లబోయాడు

మాదిరెడ్డి సులోచన

అనగా, అనగా ఓ పట్టణంగాని పట్టణంలాటి ఊరుంది. ఆ వూరికి పేరుంది. పేరు వుద్దరించే రాజుగాని రాజు గోవిందరాజు ఏలుతుండేవాడు. మంత్రిగాని మంత్రి శఠగోపం గారుండి సలహాలిచ్చేవాడు. గోవిందరాజు అయిదేళ్ళు ఎమ్మెల్యేగా చేస్తే, ఆలయపు పూజారి శఠగోపంగారు ఆయనను యథావిధిగా సేవించాడు. ఆ ఊరికి వున్న వేణుగోపాల స్వామి ఆలయం పాడుబడి భిక్షగాళ్ళకు, దిక్కులేని వారికి ఆశ్రయం ఇస్తూంది.

శఠగోపంగారు గుమస్తా, సెక్రటరీ,ప్యూన్ డ్రయివర్, వంటవాడు ఇలా ఇలా యెన్నో వేషాలతో రాజుగారిని కొలిచాడు. అయితే జనం తెలివి మీరారో, తెలివి లేదోకాని యీసారి ఎన్నికలలో గోవిందరాజు డిపాజిట్ పోగొట్టి, గోళ్ళు గిల్లుకునేలా చేశారు. ఆటో మాటిక్‌గా మంత్రి పదవి పోయింది.

ఈసారి శఠగోపంగారి సలహాయే తిప్పి కొట్టిందని అతని నమ్మకం. "మీరు మొదట ఈ పార్టీ తరపున పోటీ చెయ్యండి రాజుగారూ. గెలిచిందా గెలుపు మీదే. కాక అవతల పార్టీ గెలిచిందనుకోండి. పార్టీ మార్చెయ్యడం ఎంతసేపు!" అన్నాడు.

"ఈ ఊళ్లో నాకు ఓట్లు పడతాయన్న నమ్మకము నాకు లేదు." నిరాశపడిపోయాడు రాజు.

"ఎవడికోసం పడతాయి. అంతా హరిజనులేగా. మీరూరుకోండి, జగజీవన్‌రామ్ బొమ్మ అడ్డుపెట్టి గెలిపించేస్తాను" అన్నాడు చిటికె వేసి. గోవిందరాజు అంగీకరించాడు.

అపర వేణుగోపాలస్వామిలా వున్న శఠగోపం మూడు నామాలపై నమ్మకము కుదిరింది.

కానీ అవతలి పార్టీ గెలిచింది. శఠగోపం నెత్తిన గుడ్డేసుకుని వచ్చాడు.

"ఈ జనానికి బొత్తిగా భయభక్తులు కులం మతం అన్న అభిమానం లేదు" అన్నాడు ఆగ్రహంగా.

"సరేలేవయ్యా! ఊరికి మనం ఏం చేసామని ఏడ్పు!" అన్నాడు రాజు.

"ఊరికేం చేయకపోయినా, మనకు మనమయినా చేసుకునే అవకాశం లేదుకదా స్వామీ. చేతిలో చిల్లు పెంకులేదు" ఏడ్వలేక ఓ చవట నవ్వు నవ్వాడు శఠగోపం.

"చూడు పంతులూ! కార్యవాదులు ఓటమిని గెలుపుగానే భావిస్తారు. ఇన్నాళ్లు నువ్వు సలహా చెప్పావు, నేను విన్నాను. ఇప్పుడు నేను సలహా చెబుతాను. నువ్వు విను. డబ్బు నీకు చేతినిండా పని...."

"అ! అదెలా సామె. చెప్పండి, నా ప్రాణం లేచి వచ్చింది."

"మరి వచ్చే ఫలితం చెరిసగం పంచుకుందామా?"

"మీతో నాకు వాటా ఏమిటి సామె. ఏదో చెయ్యి విదిలిస్తే బ్రతికేవారము. అసలు పని లేక చస్తున్నామంటే నమ్మండి." విడిపోయిన జుట్టుతీసి ముడివేసుకున్నాడు.


"పనా? పోట్లాటలా?" గలగల నవ్వాడు గోవిందరాజు.

"ఏదో ఒకటి! పొలిటిక్స్ అర్థం అయినవాడిలా గోల్లు గిల్లుకుంటూ కూర్చోవడం ఎంత నరకమో మీకు తెలియదు సామి" అన్నాడు.

గోవిందరాజు శఠగోపం చెవిలో తారక మంత్రంలా ఏవో నాల్గుమాటలు చెప్పాడు.

"నిజంగా....నిజమేనా సామె." శఠగోపం ముఖం వెలిగిపోయింది.





"పని పకడ్బందీగా జరగాలి. నీకు చాటింపు చాలా ప్రీతి. కాస్త జాగ్రత్తగా వ్యవహరించాలి" అన్నాడు.

"అబ్బే...." ముక్కుకు అడ్డంగా వేలు పెట్టుకుని, నోరుమూసుకున్నాడు. ఇద్దరూ మరి కాసేపు మాట్లాడి విడిపోయారు.

వారం రోజులు గడిచాయి.

శఠగోపం దిగులుగా రచ్చబండ దగ్గర తలపై గుడ్డేసుకుని కూర్చున్నాడు. అక్కడ చేరిన చిన్నా, పెద్దా విషయం యేమిటని అడిగారు.

"ఏమి ఎలక్షన్లో ఏమో, యెందరి ప్రాణం తీస్తారో మా రాజుగారు పూర్తిగా మారిపోయారు. పిలిస్తే పలకడు, ఉలకడు, అంతా ఆ దేవుడి దయ అంటున్నాడు" అన్నాడు కన్నీళ్ళు ఒత్తుకుంటూ.

"ఛ....ఊరుకోవయ్యా: మతి చాంచల్యం నీ పగవారికి రానియ్యి. మా బావ భక్తి మార్గంలో పడ్డాడు" అన్నాడు రాజుగారి వేలు విడిచిన మేనత్త కొడుకు.

"ఎంత భక్తి అయినా దేశంపై యింత విరక్తా?" అన్నాడు.

"అంతేకాదుట, అక్కయ్యగారు చెప్పారు. రాత్రి అంతా తనలో తానె భజన చేస్తారట," అన్నాడు.

"అయితే వారిని చూడవల్సిందే" అన్నారు పెద్దలు.

"నాకు చూడాలనిలేదు. మహారాజులా తిరిగే మనిషి, అలా అయ్యాడంటే దిగులుగా వుంది" శఠగోపం ఎగబీల్చాడు.

వాళ్ళంతా వెళ్ళేసరికి గోవిందరాజు పడక కుర్చీలో కూర్చుని పైకిచూస్తూన్నాడు. 'కృష్ణం భజరాదా!' అంటూ తనలో తాను గొణుక్కుంటున్నాడు.

"గోవిందరాజుగారూ! నమస్కారమండీ" అన్నా డోపెద్ద.

"కృష్ణార్పణం! రండి వచ్చిలా కూర్చోండి" అన్నాడు అర్ధనిమీలిత నేత్రాలతో అందరినీ ఒకసారి చూచి.

"మీరు ఊళ్ళోకి రావటమే మానేసారు," కూర్చుని అడిగారెవరో.

"ఊరా, వల్లకాడా? అంతా మిథ్య! అంతా మాయ" అన్నాడు.

"అదికాదండీ...." మరొకతను మాట్లాడబోయాడు.

"కృష్ణార్పితం అయిన ఈ ఇంటి ఆవరణలో దేశం, రాజకీయం మాట్లాడవద్దని ప్రార్థన. రారా పుణ్యాత్ములారా! రారా భక్తులారా!" అంటూ పాట మొదల్పు పెట్టేరు. ఇలా మాట్లాడుతుండగానే, ఆయన తన్మయత్వంలో పాట మొదలు పెట్టేడు. ఆయనకు పాట, ఆట రాదు. అందుకే అందరూ గోవిందరాజుగారిపట్ల గౌరవం యేర్పరచుకున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని, ఒక వేదాంత ధోరణిలో మాట్లాడి వెళ్ళిపోయారు. రోజూ ఇలా హితులు, స్నేహితులు, తెలిసినవారు రావటం పోవటం జరిగింది.

నెలరోజులు గడిచాయి.

ఒకరోజు శఠగోపం హడావుడిగా పరిగెత్తుకుంటూ వచ్చాడు. "ఈ విడ్డూరం విన్నారా? మన గోవిందరాజుగారికి రాత్రి శ్రీకృష్ణ పరమాత్మ కలలోకి వచ్చేడట" అన్నాడు.

"ఆఁ! నిజమేనా, ఇందాక మా అబ్బాయి చెబితే వుత్తదే అని కొట్టివేసాను" అన్నాడు లింగయ్యశెట్టి.

"ఇదేం చిత్రమండీ!ఓసారి వెళ్ళి చూద్దామా! అన్నాడు మరో షావుకారు.

శఠగోపంతో కలసి అందరూ గోవిందరాజు ఇంటికి వెళ్ళారు. ఆయన సన్నగా పాడుతూ కూర్చున్నారు.

"ఏమిటి రాజుగారూ! ఏదో స్వప్నం అని అందరూ అంటున్నారు." ఏం యెరగనట్టు అన్నాడు శఠగోపం.

"ఏదో ఆ కృపాసింధు, ఆ దీనబంధు...." అంటూ మొదలు పెట్టేడు రాజు.

"గోవిందరాజుగారూ! మీరు ఆ వేణుగోపాలుని దర్శించారు. ఆ వైనం విని తరిస్తాం. వివరించండి" అన్నాడు కరణంగారి బావ.

"అది మీకు తమాషాగా వుండొచ్చు. అర్థరాత్రి అయింది. అప్పుడే మాగన్ను పడింది. కృష్ణా కృష్ణా అంటూ నా అధరాలు ఆదిరిపడుతున్నాయి. వెలుగు....వర్ణించలేని వెలుగు వచ్చింది. 'పిలిచావా భక్తా,' అన్నారెవరో. యెటుచూచినా ఆ స్వామే కనిపించాడు. ఆ వేణు నాదమే వినిపించింది. కళ్ళు విప్పలేకపోయాను...."

"ధన్యుడవయ్యా రాజూ...." అంటూ శఠగోపం సాష్టాంగ పడ్డాడు.

"చెప్పనియ్యవయ్యా!" లింగయ్య విసుక్కున్నాడు.


"కళ్ళు విప్పుదాం అంటే జిగురుపెట్టి అంటించినంతగా అంటుకున్నాయి. యేం చేయాలి, నిజమా, కలా అనుకుంటున్నాను. 'రాజూ! ఊళ్ళో వుండాలనుకున్నాను. ఆలయం అడవిలా చేసావ్. పునరుద్ధరించు. ఊరికి జయం కలుగుతుంది' అన్నాడు."

"నిజంగానా?" కరణం నోరు తెరిచాడు.

"అంతేకాదు. విగ్రహాలు విరిగిపోయాయట. తన అంశగల విగ్రహాలు నా పొలంలో








వున్నాయట. త్రవ్వించు అన్నారు." అని చెప్పాడు గోవిందరాజు.

"నీ పొలంలో యెక్కడో చెప్పాడా?"

"పొన్నచెట్టు నీడలో తలదాచుకున్నానని అన్నాడు." రాజుగారు కళ్ళు మూసుకొని విన్నవించాడు.

"త్రవ్విచూస్తే పోలేదా?"

"వద్దు శెట్టిగారూ! వద్దు. విగ్రహాలు దొరికాయనుకోండి. విగ్రహప్రతిష్ఠాపన, గుడిపునః నిర్మించడం నావల్ల అయ్యేపని కాదు. ఆ స్వామిని మనో నేత్రంతో దర్శించి ధన్యుడనవుతాను"అని,మీరు వెళ్ళవచ్చు అన్నట్టు కళ్ళ మూసుకొని 'కృష్ణ కృష్ణ!' అంటూ పాటలు మొదలుపెట్టేడు.

వాళ్ళంతా రచ్చబండ దగ్గరకొచ్చారు.

"ఆయన కృష్ణకృపకు పాత్రుడయ్యాడు. అతన్ని వదలివేద్దాం. మన సంగతి ఏమిటి? ఊరికంతా అరిష్టం కదా" అన్నాడు శఠగోపం.

"కలలు నిజం అవుతాయా! ఆయన ఆ ధ్యాసలో వున్నాడు కాబట్టి అలా అనిపించి వుంటుంది" అన్నారెవరో.

"ఛ... ఛ... ఆయన వున్నాయి అనలేదు పోనీ డబ్బు ఖర్చులేలి పని. మనమంతా తలా ఒక చెయ్యివేసి త్రవ్విచూద్దామా?" అన్నాడు శఠగోపం.

"నీ సలహా బాగుందయ్యా! విగ్రహాలు లేకపోతే అతని ఊహ అవుతుంది. నిజంగా వుంటే, నేను అయిదు వేలిస్తాను" లింగయ్య శెట్టి అన్నాడు.

"అదేం మాట! మేమేనా తీసిపోయింది. విగ్రహాలు బయటపడితే నేను అయిదువేలు ఇస్తాను" రెడ్డిగారు అన్నారు.

"మేమూ ఇస్తాము ఇంతో....అంతో...." కరణంగారు అన్నారు. అరగంటలో పేపర్ మీద లక్షరూపాయలు పోగయ్యాయి. అందరూ కుతూహలంగా వెళ్ళి, రాజుగారి పొలంలో పొన్నచెట్టుకోసం వెతికారు. పొన్నచెట్టు కింద దట్టమయిన పొదలూ పుట్టలూ కనిపించాయి. అతి కష్టంపై అవి పెకిలించారు. పొన్నచెట్టు చుట్టూ మూడురోజులు త్రవ్వారు. రెండు మీటర్ల లోతులో వాళ్ళకు పాతబడిన యిత్తడి విగ్రహాలు దొరికాయి. వాటిని తాకటానికి

అందరి చేతులు వణికాయి.

"ఆగండి....ఆగండి" శఠగోపం దూరం జరిగి శ్లోకాలు చదువుతూ పడిపోయాడు.

నిమిషాలమీద ఈ వార్త ఊరంతా ప్రాకిపోయింది. జనం తండోపతండాలుగా వస్తున్నారు. అదో యాత్రాస్థలంగా మారిపోయింది.

లక్షయాభయివేల రూపాయలు తాలూకా హెడ్ క్వార్టర్ నుండి వసూలయి వచ్చాయి. మేళ, తాళాలతో విగ్రహాలను ఊరేగించి తీసుకెళ్ళారు. నిమిషాలపై గుడి పునరుద్ధరించారు.

డబ్బు వస్తూనే వుంది. మన జనం ఇద్దరికే జడిసి దబ్బిస్తారు. ఒకరు పోలీసులు. రెండు దేవుడు.

దానికి పరమ భక్తుడయిన గోవిందరాజు ట్రస్టీ అయ్యాడు.

"నాకీ బాదరబందీ యెందుకు? ఆ స్వామి చరణాలు కడిగిన తీర్థంలో తులసీదళం వేసి యివ్వండి" అన్నాడు.

"అలా అనకండి గోవిందరాజు! నీ మూలంగా కదూ, జనం కళ్ళు తెరిచారు" అన్నారంతా.

మిగిలిన డబ్బు దేవుడిపేర బ్యాంక్ లో వేయాలని ఆ వడ్డీతో పూజారికి జీతం ఇవ్వాలని దేవుడిపేరిట సంబరాలు జరిపించాలని నిర్ణయం జరిగింది.

"మరొకడు యెందుకు? శఠగోపంగారే పూజారిగా వుంటారు. మొదటి నుండి అన్నీ తెలిసినవాడు" అన్నారు జనం.

"ఆ మహానుభావుడి సేవకు యెప్పుడూ సిద్ధమే" భక్తిగా నమస్కరించాడు శఠగోపం.

నిత్య కళ్యాణం పచ్చతోరణంలా అయ్యింది శఠగోపం పని.

గోవిందరాజు పని ఇరుకులో పడింది. ఆ డబ్బు తనకు దక్కాలి. ఎలా అన్నదే తోచటం లేదు.

ఆశకు అంతులేదు అంటారు. అలాగే శఠగోపం పని తయారయింది. అతను ఈ వచ్చే జీతంతో జీవితం యెలా వెళ్ళమారుస్తాడు! గోవిందరావుగారి సెక్రెటరీగా వున్న కాలంలో యింతో, అంతో మందు కొట్టటం, మజా చేయటం నేర్చుకున్నాడు. అతను గుడికి తాళం పెడుతుండగా గోవిందరాజు వచ్చాడు.

"రండి సామె రండి. తమ దర్శనానికే రావాలనుకుంటున్నాను" శఠగోపం అన్నాడు.

గోవిందరాజు గుడితలుపులు తీయించి, నమస్కరించి, గుడిముందు కూలబడిపోయాడు.

"మీరు చెప్పిన నాటకం యెలా ఆడానంటారు? ఎక్కడయినా పొల్లుబోయిందా?" అన్నాడు శఠగోపం.

"ఏం నాటకం లేవయ్యా! ప్రభుత్వజీతగాళ్ళకిచ్చినట్లు పింఛను నీకు దొరుకుతుంది. గడ్డి కుప్పకాడి కుక్కలా నేనో ట్రస్టీనట, ట్రస్టీని" అన్నాడు కోపంగా.

"అ! ఆ వడ్డీ డబ్బులు రెండుపూటలు చాపకుండా తినటానికి సరిపోతాయేమో తప్ప, యెందుకు పనికిరావు" శఠగోపం అన్నాడు.

"నీ ఆశ కూలా! నా కేం మిగిలిందని...."

"మరీ అంత అన్యాయంగా మాట్లాడకండి సామె. స్వామివారి ప్రతిష్టాపనాకు జరిగిన ఖర్చులో యాభై శాతం మిగిలింది" అన్నాడు.

"అదో లెక్కా! ఈ డబ్బు మనకొచ్చే మాస్టర్ ప్లాన్ వేస్తాను. నీ వాటాకు ఓ అయిదు వేలిస్తానయ్యా. తీసుకుని యెక్కడికయినా వెళ్ళు."

"అయిదు వేలా....అయిదు! ముష్టి వేస్తున్నారా సామె" అన్నాడు.

"ముష్టికాక ముడుపా! శఠగోపం ఆశ కంతుండాలయ్యా?"


"నాకే ఆశంటారా సామె, మీ గురించి, మీ సన్యసించడం గురించి, మీ భక్తిభావం గురించి వాగిన దానికి టీ ఖర్చులు కావు అయిదు వేలు. మీరేం కష్టపడ్డారండి."

"ఒరేయ్! తిన్నగా అడుగుతావా! నటించటం యెంత కష్టమో నీ కేం తెలుసు?"

"మీరు నటించారు, నేను పడ్డశ్రమ గుర్తుకు రావా? అక్కడే త్రవ్వితే జనం చూస్తారని, అయిదారు మీటర్ల పొడవునా సొరంగం త్రవ్వి విగ్రహాలు పెట్టాను. కూలిని పిలిచినా గుట్టు



తాజాదనమునకు, ఆరోగ్యమునకు వరప్రదానం
స్వస్తిక్ నీమ్ సబ్బు




శరీరమును, పులకింప జేస్తుంది,
తాజాదనముతో నింపుతుంది

స్వస్తిక్ నీమ్ సబ్బు

గరిష్ఠ ధర రు. 1-40. స్థానిక పన్నులు అదనం

Shilpi.DM 16A/80 Tel

బయటపడుతుందని భయపడ్డాను. చేతులకు పొక్కులు వచ్చాయి" అన్నాడు.

"ఇదిగో శఠగోపం కంఠశోష యెందుకు? అయిదువేలు కావాలా వద్దా?"

"నా కెందుకు ముష్టి! సగం వాటా కావాలి."

"వాటా యివ్వకపోతే...." గోవిందరాజుకు కోపం ముంచుకువస్తుంది.

"ఏముంది సామే. జరిగిన విషయాలు ఊళ్ళో అంటాను. నాకేం భయమా!" అన్నాడు నిర్లక్ష్యంగా "మీకు తెలుసు నాకు చాటింపు ఇష్టమని...."

"ఓహో! అంతవరకు వచ్చిందా వ్యవహారం! అలాగే చెప్పుకో పో. డప్పుచ్చుకు మరీ చాటించు. నాకేం భయం" అన్నాడు.

శఠగోపం గుడితాళాలు అయ్యగారిముందు విసిరికొట్టి, విసురుగా ముందుకు వెళ్ళాడు. గోవిందరాజుకు యిలాంటి సందర్భాలలో యెక్కడలేని ధైర్యం వస్తుంది. లేచి, శఠగోపం భుజాన వేసుకున్న పైపంచ ఒడుపుగా అతని మెడకుబిగించి వెనక్కులాగాడు.

"ఏమిటిది...ఏ....మి....టి....సా....మె" అన్నాడు అతను.

ఆ రాత్రి గడిచింది.

తెల్లవారింది. ఊర్లో గల్లంతుగా వుంది. దేవాలయ ధర్మకర్త గోవిందరాజింట్లో చోరీ, తలపై బలంగా బాదడం మూలాన ధర్మకర్త స్పృహ తప్పాడట.

ఆ దొంగతనం చేసిందెవరో కాదుట. పూజారి శఠగోపమేనట. ఆలయం ముందు చచ్చిపడివున్నాడు శఠగోపం. అక్కడక్కడ రూపాయలు, మేడిపువ్వులు, కళ్ళు, పాదాలు పడివున్నాయట.

ధర్మకర్తను పూజారి దోచే ప్రయత్నం చేస్తే, పూజారిని దొంగల రూపంలో వచ్చిన దేవుడే దోచాడని వింతగా చెప్పుకుంటున్నారు. జనం తండోపతండాలుగా వస్తున్నారు.

పోలీసులకు రిపోర్టుద్దామన్నారు అంతా. అప్పుడే తలకు కట్టుకట్టుకుని వచ్చాడు గోవిందరాజు.

"అంతా మిధ్య! అంతా ఆ స్వామిదే అని మరిచి స్వార్ధచింతనతో ప్రాణాలు తీసుకున్నాడు శఠగోపం. పూజారిని నియమిస్తే నా పొలం మీద వచ్చే ఆదాయంతో జీతం యిస్తాను. పోలీసులకిస్తే చచ్చినపామును చంపినట్టు. వాడి శరీరం కోస్తారు, చీలుస్తారు. డబ్బు ముఖ్యంకాదు మనకు. అతను చేసిన ఆ స్వామి సేవ ముఖ్యం. మీరు అందరూ అతన్ని క్షమించాలని ప్రార్థిస్తున్నాను...." అన్నాడు. అందరూ ముఖాలు చూసుకుంటుండగానే గోవిందరాజు ఓ భక్తిగీతం ఎత్తుకున్నాడు. అందరూ గొంతులు కలిపి పాడారు.

అపశృతిలా అప్పుడప్పుడు శఠగోపం భార్య ఏడుపు వినిపిస్తోంది.

అరగంట గడిచింది.

"ఈ కాయాన్ని కృష్ణార్పణం చేయాలంటే డబ్బు కావాలి. ఆ డబ్బు నేనిస్తాను. నా ఇల్లు దోపిడీ అయింది. ఈ ఉంగరం అమ్మి డబ్బు తీసుకురండి" అని చేతి వుంగరం తీసి యిచ్చాడు.

"ఎందుకండీ! తలా పదిరూపాయలు వేస్తాం చాలు" అన్నారు జనం.

అలా, అలా, నిమిషాలమీద వసూలయింది డబ్బు.

శఠగోపం శవం లేచింది. గుడిలో దేవుడు తెల్లబోయినట్టు చూచాడు.

గోవిందరాజు కళ్ళు ఒత్తుకున్నాడు. □

వచ్చే సంచికలో
అవసరాల రామకృష్ణారావు పెద్దకథ
'పిల్లలే బుద్ధి చెప్పాలి'
చదవండి